**18వ అధ్యాయం**

# ١٨ - بَابٌ فِي النَّهْيِ عَنِ الْبِدَعِ وَمُحْدَثَاتِ الأُمُورِ

# (ధర్మంలో) కొత్తపోకడలు, నూతన ఆచారాలు సృష్టించరాదు

قال الله تعالى: ﴿فَمَاذَا بَعْدَ الْحَقِّ إِلَّا الضَّلَٰلُ﴾ [يونس: ٣٢]، وقال تعالى: ﴿مَّا فَرَّطْنَا فِي الْكِتَٰبِ مِن شَيْءٍ﴾ [الأنعام: ٣٨]، وقال تعالى: ﴿فَإِن تَنَٰزَعْتُمْ فِي شَيْءٍ فَرُدُّوهُ إِلَى اللَّهِ وَالرَّسُولِ﴾ [النساء: ٥٩] أي: الْكِتَابِ وَالسُّنَّةِ. وَقَالَ تَعَالَى: ﴿وَأَنَّ هَٰذَا صِرَٰطِي مُسْتَقِيمًا فَاتَّبِعُوهُ وَلَا تَتَّبِعُوا السُّبُلَ فَتَفَرَّقَ بِكُمْ عَن سَبِيلِهِ﴾ [الأنعام: ١٥٣]، وقال تعالى: ﴿قُلْ إِن كُنتُمْ تُحِبُّونَ اللَّهَ فَاتَّبِعُونِي يُحْبِبْكُمُ اللَّهُ وَيَغْفِرْ لَكُمْ ذُنُوبَكُمْ﴾ [آل عمران: ٣١] وَالآيَاتُ فِي الْبَابِ كَثِيرَةٌ مَعْلُومَةٌ.

దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ సెలవిచ్చాడు : "సత్యాన్ని తృణీకరిస్తే మార్గభ్రష్టత్వం తప్ప ఇక మిగిలేదేమిటి?" (యూనుస్ : 32)

మరోచోట అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : "విధి వ్రాత ఉన్న గ్రంథంలో మేము ఏ కొరతా చెయ్యలేదు." (అల్ అన్ ఆమ్ : 38)

ఇంకొకచోట ఆయన ఇలా అన్నాడు : "మీ మధ్య ఏ విషయంలోనైనా వివాదం తలెత్తితే దాన్ని అల్లాహ్‌కు, ప్రవక్తకు నివేదించండి." అంటే దైవ గ్రంథం మరియు ప్రవక్త సంప్రదాయం వైపుకు మరలండి. (అన్ నిసా : 59)

ఆయన ఇంకా ఇలా అన్నాడు : "నా ఋజు మార్గం ఇదే. కనుక మీరు దీనిపైనే నడవండి. వేరే మార్గాలపై నడవకండి. ఎందుకంటే అవి మిమ్మల్ని ఆయన మార్గం నుంచి తొలగించి విచ్ఛిన్నపరుస్తాయి." (అల్ అన్ ఆమ్ : 153)

ఇంకా ఇలా సెలవిచ్చాడు : "ప్రవక్తా! నీవు ప్రజలకు ఇలా చెప్పు: మీకు నిజంగానే అల్లాహ్ పట్ల ప్రేమ ఉంటే నన్ను అనుసరించండి. అప్పుడు అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు, మీ పాపాలను మన్నిస్తాడు." (ఆలి ఇమ్రాన్ : 31)

وَأَمَّا الأَحَادِيثُ فَكَثِيرَةٌ جِداً، وَهِيَ مَشْهُورَةٌ، فَنَقْتَصِرُ عَلَى طَرَفٍ مِنْهَا:

ఈ అధ్యాయం క్రింద సుపరిచితమైన సూక్తులు చాలా ఉన్నాయి. హదీసులు కూడా చాలా ఎక్కువగానే ఉన్నాయి. అవి కూడా సుప్రసిద్ధమైనవే. వాటిలో కొన్నింటిని మాత్రమే మేము ఇక్కడ ప్రస్తావిస్తున్నాం -

١٧٠ ـ عن عائشةَ رضي الله عنها، قالت: قال رسولُ الله ﷺ: «مَنْ أَحْدَثَ في أَمْرِنَا هٰذَا مَا لَيْسَ مِنْهُ فَهُوَ رَدٌّ» متفقٌ عليه.

170. హజ్రత్ ఆయిషా (రజి.అన్హా) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు : ఎవరైనా మా ఈ ధర్మంలో లేని కొత్త విషయాన్ని ప్రవేశపెడితే అది త్రోసిపుచ్చదగినది. (బుఖారీ - ముస్లిం)

وفي روايةٍ لمسلمٍ: «مَنْ عَمِلَ عَمَلاً لَيْسَ عَلَيْهِ أَمْرُنَا فَهُوَ رَدٌّ».

"ఎవరైనా మేము ఆదేశించని పని ఏదైనా చేస్తే అది త్రోసిపుచ్చదగినది'' అని ముస్లింలోని వేరొక ఉల్లేఖనంలో ఉంది.

*(సహీహ్ బుఖారీలోని 'ఒడంబడికల' ప్రకరణంలో ఇంకా సహీహ్ ముస్లింలోని వ్యాజ్యాల ప్రకరణంలోనూ ఈ హదీసు ఉంది.)*

## ముఖ్యాంశాలు

ఈ హదీసులో అతి ముఖ్యమైన సూత్రం ఒకటి వివరించబడింది. దురదృష్టవశాత్తూ ముస్లింలు ఈ హదీసును, ఇందులో బోధింపబడిన విషయాన్ని పట్టించుకోవటం లేదు. ఫలితంగా ధర్మంలో కొత్తపోకడలు, వినూత్న చేష్టలు సర్వసామాన్యమైపోయాయి. ఇంకా చెప్పాలంటే అమాయక జనులు కొత్తపోకడల(బిద్అత్)ను, ఆచార వ్యవహారాలనే అసలు ధర్మంగా తలపోస్తున్నారు. ఈ నూతన ఆచారాలను విధులు (ఫరాయజ్)గా భావించి ఆచరిస్తున్నారు. దీనికి ధర్మజ్ఞానం లేకపోవడం మొదటి కారణమైతే పై హదీసులో వివరించబడిన నియమాన్ని అర్థం చేసుకోకపోవటం రెండో కారణం. మరి చూడబోతే దైవప్రవక్త (సల్లం) ఆ నియమాన్ని ఈ హదీసులో ఎంతో స్పష్టంగా తేటతెల్లం చేసి మరీ బోధించారు. దాని ప్రకారం ; దైవప్రసన్నతను బడయటానికి చేసే ప్రతి పనీ - ఖుర్ఆన్, హదీసుల ద్వారా దానికి రుజువు లభించకపోతే లేక షరీఅత్ సూత్రాలకు ప్రవక్త సహచరులు, వారి అనుచరులు (తాబెయీన్) చేసిన వ్యాఖ్యానాల ద్వారాగాని లేదా వారి ఆచరణ వల్లగాని దానికి ఆధారం లభించకపోతే - అది బిద్అత్ (క్రొత్త పోకడ) క్రిందికే వస్తుంది.

١٧١ ـ وعن جابر رضي الله عنه قال: كـان رسـولُ الله ﷺ، إذا خطـبَ احْمـرَّتْ عَيْناهُ، وَعَلا صَوْتُهُ، واشْتدَّ غَضَبُهُ، حتَّى كأنَّهُ مُنْذِرُ جَيْشٍ يقُولُ: «صَبَّحكُمْ وَمَسَّاكُمْ» ويقُولُ: «بُعِثْتُ أنَا والسَّاعةُ كَهَاتَيْنِ» وَيقْرِنُ بيْنَ أُصْبُعَيْهِ؛ السَّبَّابَةِ وَالْوُسْطى ويقُولُ: «أمَّا بَعْدُ؛ فإنَّ خيْرَ الْحدِيثِ كتَابُ اللهِ، وَخَيْرَ الْهَـدْيِ هَـدْيُ مُحمَّـدٍ ﷺ وشـرَّ الأُمُـور مُحْدثَاتُها، وَكُلَّ بِدْعَةٍ ضَلالةٌ» ثُمَّ يقُولُ: «أنَا أوْلَى بِكُلِّ مُؤْمِنٍ مِنْ نَفْسِهِ، مَنْ تَرَكَ مَالاً فَلأَهْلِهِ، وَمَنْ تَـرَكَ دَيْنـاً أوْ ضَيَـاعـاً فَـإلَيَّ وَعَلَيَّ» رواه مسلم.

171. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లం) ఖుత్బా (ఉపన్యాసం) ఇచ్చినప్పుడు ఆయన కళ్ళు ఎర్రబడేవి. గొంతు బిగ్గరగా అయ్యేది. కోపం తీవ్రమయిపోయేంది. శత్రుసైన్యం ఉదయంగాని లేక సాయంత్రం గాని మీపై దాడిచేయనుందని ప్రజల్ని అప్రమత్తం చేసేవానిలా ఆయన ఆ సమయంలో కనిపించేవారు. ఇలా అనేవారు: నేనూ మరియు ప్రళయం ఈ రెండు వ్రేళ్ల మాదిరిగా పంపబడ్డాము. ఇలా అన్నప్పుడు ఆయన తన చూపుడు వ్రేలునూ, మధ్యవ్రేలిని కలిపి చూపించేవారు (అంటే తన తరువాత ప్రళయం వరకూ ఇక ఏ ప్రవక్తా రాడని అర్థం.) ఇంకా ఇలా అనేవారు : చెప్పొచ్చేదేమిటంటే, నిస్సందేహంగా అన్నిటికన్నా మంచిపలుకు దైవగ్రంథము. మార్గాలన్నిటిలోకీ మేలైన మార్గం ముహమ్మద్ మార్గం. అన్ని పనుల్లోకెల్లా చెడ్డపనులు (ధర్మంలో) కొత్తగా సృష్టించబడినవి. ప్రతి కొత్తపోకడ (బిద్అత్) మార్గభ్రష్టతే.” ఆ తరువాత “ప్రతి విశ్వాసిపై నాకు అతని ప్రాణానికన్నా ఎక్కువ హక్కు ఉంది. ఎవరైనా (తన తదనంతరం) ధనం వదలి వెళితే అది అతని వారసులకే చెందుతుంది.అదే ఎవరైనా రుణం గాని లేక అభాగ్య పరివారాన్నిగాని వదలివెళితే (ఆ

రుణాన్ని తీర్చే) బాధ్యత నాపై ఉంటుంది. ఇంకా (అతని సంతానాన్ని పర్యవేక్షించే) విధి కూడా నాపైనే ఉంటుంది.'' అని ఆయన అనేవారు.
(ముస్లిం)

(సహీహ్ ముస్లింలోని జుమా ప్రకరణం)

## ముఖ్యాంశాలు

ఈ హదీసులో దైవప్రవక్త (సల్లం) ఉపన్యసించే తీరును గురించి వివరించటం జరిగింది. దైవప్రవక్త ప్రభవనం ప్రళయం రాకకు సూచన అని చెప్పబడింది. ఖుర్ఆన్ మరియు హదీసుల ప్రాధాన్యాన్ని గురించి బోధిస్తూ క్రొత్తపోకడలు (బిద్అత్‌లు) వినాశానికి గొనిపోతాయని ఈ హదీసు హెచ్చరిస్తోంది. ఇంకా సమాజంలోని అనాథల్ని, అభాగ్య జీవుల్ని ఆదుకోవడం సమకాలీన ప్రభుత్వం యొక్క బాధ్యత అని కూడా అంటోంది. ఎందుకంటే ఖలీఫా (ప్రభుత్వాధినేత) దైవప్రవక్తకు ప్రతినిధి లాంటివాడు. ఆయన తన జీవితకాలంలో చేసిన పనుల్ని ఆయన తదనంతరం ఖలీఫా అయిన వ్యక్తి విధిగా నిర్వర్తించాలి. అయితే ప్రజలు వదలిపెట్టి వెళ్ళిన ఆస్తులకు వాళ్ళ వారసులే హక్కుదారులు అవుతారు గాని ఇతరులెవరికీ వాటిపై హక్కు ఉండదు.

172. (ఇంచుమించు పై హదీసును పోలిన) హజ్రత్ ఇర్‌బాజ్ బిన్ సారియా (రజి) హదీసు ఇంతకు ముందు "ప్రవక్త సంప్రదాయాన్ని కాపాడటం" అన్న అధ్యాయం క్రింద వచ్చింది.

١٧٢- وعن الْعِرْبَاضِ بن سَارِيَةَ، رضي الله عنه، حَدِيثُهُ السَّابِقُ في بَابِ الْمُحَافَظَةِ عَلَى السُّنَّةِ.